జేబీఐఐపీ కు డీఆర్‌డీఓ పురస్కారం

సిటీ బ్యూరో, మార్చి 3,(నమస్తే తెలంగాణ): జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్వెంటర్స్ అసోసియేషన్ కి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ నుండి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. సైన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ అభివృద్ధి, ఉత్పత్తుల రూపకల్పనలో విశేషంగా పాల్గొన్నందుకు, విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కార్యదర్శి డాక్టర్ సతీష్ రెడ్డి ఈ పురస్కారాన్ని అందించారు.

యాంటీ బయోటిక్స్ రెసిస్టెన్స్‌లో భారత్ కీలకం

సుల్తాన్ బజార్, మార్చి 3. యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్‌పై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భారత్ కీలకపాత్ర పోషించనున్నదని ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ బుర్రి రంగారెడ్డి అన్నారు. మాస్కోలోని రాడిసన్ స్లావియాన్స్కియా హోటల్‌లో నిర్వహించిన 3వ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ మెడికల్ మైక్రోబయాలజీ, ఇన్ఫెక్టోలజీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాంటీమైక్రోబయల్ చికిత్స నిర్వహణలో వివాదాలను ఎదుర్కోవడం అనే అంశంపై ఉపన్యాసం చేశారు.

అంకితభావంతో పనిచేయాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ) జీహెచ్ఎంసీలో 174 మంది జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్స్‌ను సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు. ఈ నియామకాలు టీజీ పీఎస్సీ ద్వారా గ్రూప్ 4 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా జీహెచ్ఎంసీకి కేటాయించిన అభ్యర్థుల్లో రిపోర్టు చేసిన 174 మంది జూనియర్ అసిస్టెంట్లకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్, సర్కిల్ కార్యాలయాలకు కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లను మేయర్ విజయలక్ష్మి సంబంధిత ఉద్యోగులకు అందజేశారు. పరిపాలన విభాగం అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనాలన్నీ పనిచేస్తున్నయ్

నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): నిమ్స్‌లో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలన్నీ పనిచేస్తున్నాయని దవాఖాన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. యాజమాన్యం నిర్వహణ లేక నిమ్స్ దవాఖానలో బ్యాటరీ వాహనాలు మూలకు పడ్డాయంటూ 'నిర్వహణ లేక మూలకు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డైరెక్టర్ డా.బీరప్ప స్పందిస్తూ దవాఖానలో ప్రస్తుతం ఆరు బ్యాటరీ వాహనాలున్నాయని తెలిపారు. ఆ వాహనాలన్నీ సక్రమంగానే పనిచేస్తున్నాయని, ప్రతిరోజు రోగులను ఆయా బ్లాక్‌లకు చేరవేస్తూ సేవలందిస్తున్నట్లు వివరించారు.

111 శాఖలను ప్రారంభించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా

సిటీబ్యూరో, మార్చి 3,(నమస్తే తెలంగాణ): బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 111 నూతన శాఖలను సోమవారం ప్రారంభించింది. ఆ సంస్థ ఎండీ రజనీష్ కర్నాటక్ వీటిని ప్రారంభించారు. వీటిలో తెలంగాణలో 11, ఏపీలో 6 శాఖలను ప్రారంభించడం గమనార్హం.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఖైరతాబాద్, మార్చి 3 : బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మినగ గోపి డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో బోయకులస్తులను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారని, ఆ మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో పుట్ట అంజయ్య, మాదరబోయిన నర్సయ్య, వెంకటస్వామి, అలివేలు, సి. పరమేశ్వరి, గుజ్జుల యాదయ్య, బోయ రమేష్, నిర్మల, బోయ సుధాకర్, మినగ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లింగ్ పేరుతో కుచ్చుటోపీ

- అదనపు చార్జీల పేరుతో వాహన షోరూంల జిమ్మిక్కులు
- 15 వేల వరకు అక్రమంగా వసూలు
- రవాణా శాఖకు ఫిర్యాదుల వెల్లువ
- 3 షోరూంలకు షోకాజ్ నోటీసులు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : కొత్త వాహనాలు కొంటున్న వారికి పలు షోరూంల నిర్వాహకులు కుచ్చుటోపీ పెడుతున్నారు. వాహనం కొనుగోలు చేసిన వారి నుంచి హ్యాండ్లింగ్ చార్జిలు, ఆర్టీఏ చార్జిల పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్ని షోరూంలలో 10 వేల నుంచి 15 వేల వరకు ఏకంగా బిల్లులోనే చూపిస్తున్నారు. ఇది నిజమేననుకుని చాలా మంది వాహనదారులు డబ్బులు చెల్లిస్తున్నారు. తీరా ఆ డబ్బులు చెల్లించిన వివరాలు ఇన్ వాయిస్‌లో ఎక్కడా ఉండదు. ఇలాంటి సంఘటనలతో మోసపోతున్న కొందరు ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తక్షణం స్పందించిన రవాణా శాఖ 3 షోరూం నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇదే కాకుండా.. మరి కొన్ని వాహన షోరూంలు డిస్కౌంట్ పేరుతో వాహనాలను విక్రయిస్తున్నాయి. దీంతో వాహనదారులు డిస్కౌంట్ మినహాయించగా ఉండే ధరపైనే లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తామని చెబుతున్నారు. అది నిబంధనలకు విరుద్ధం కావడంతో వాహనదారులకు రవాణా శాఖ అధికారుల మధ్య వాగ్వాదాలకు దారి తీస్తున్నది. ఈ సంఘటనల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న షోరూంలపై చర్యలకు ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది.

ముందే తెలుసుకోండి..!

వాహన కొనుగోలు సమయంలో షోరూంలు ఇచ్చిన డిస్కౌంట్‌కు కూడా వినియోగదారుడు పన్ను చెల్లించాల్సిందే. పూర్తి పన్ను చెల్లిస్తేనే ఆ వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కాదంటే రిజిస్ట్రేషన్‌కు బ్రేకులు పడతాయి. షోరూంలు ఎంత డిస్కౌంట్ ఇచ్చినా ట్యాక్స్ కట్టేటప్పుడు మాత్రం వాస్తవ ధర ఆధారంగా లెక్కిస్తారని ఆర్టీఏ అధికారులు స్పష్టం చేస్తున్నారు. డిస్కౌంట్ ధరతో తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఇటీవల 3.34 కోట్ల విలువ జేసే మెర్సిడేస్ బెంజ్‌కు ఓ షోరూం 30 లక్షల డిస్కౌంట్‌తో ఓ వినియోగదారుడికి విక్రయించింది. దీంతో అతడు 3.4 కోట్లకు కారు కొనుగోలు చేశాడు. కానీ ఆర్టీఏ కార్యాలయంలో ట్యాక్స్ కట్టేటప్పుడు మాత్రం 3.34 కోట్లకు లెక్కిస్తామని అధికారులు స్పష్టం చేశారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనం అసలు ధరపైనే పూర్తి పన్ను చెల్లించాల్సిందే. ధర లో డిస్కౌంట్ అనేది కేవలం కంపెనీ ఇచ్చిన ఆఫర్ మాత్రమే. డిస్కౌంట్ వ్యత్యాసం పన్ను మినహాయింపుకు వర్తించదని అధికారులు చెబుతున్నారు.

డిస్కౌంట్ వేరు.. పన్ను వేరు..!

ఉదాహరణకు ఒక వాహనం ధర రూ.20 లక్షలు ఉంటే కంపెనీ డిస్కౌంట్ పేరుతో కస్టమర్‌కు 10 లక్షలకు ఇచ్చినా.. ఇన్‌వాయిస్ బిల్లు 10 లక్షలతో తీసుకొచ్చినా.. ఆ వాహన ధర ఆర్టీఏ డాటాబేస్‌లో ఉంటుంది. ఆ 20 లక్షల పైన 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ అనేది పన్ను మినహాయింపునకు కాదనేది కస్టమర్లు అవగాహన చేసుకోవాలని ఆర్టీఏ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొందరూ తనపై రెండు వాహనాలున్నప్పటికీ ట్యాక్సీ మరో 2 శాతం అధికంగా చెల్లించాల్సి ఉంటుందనే విషయం కూడా తెలుసుకోకుండా కొనుగోలు చేసి తీరా రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. షోరూం వాళ్లు కూడా ఈ విషయం చెప్పకుండా వాహనం విక్రయించడమే పరమావధిగా పెట్టుకుంటున్నారు. విషయం తెలిస్తే తమ కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించేవాళ్లమని వాహనదారులు చెబుతున్నారంటూ అధికారులు పేర్కొన్నారు.

షోరూంల రిజిస్ట్రేషన్ అథరైజేషన్ సస్పెండ్ చేస్తాం

రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా వాహనాలను విక్రయిస్తున్న షోరూం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు వాహనాలను విక్రయించేటప్పుడు ఆర్టీఏ చార్జెజ్, హ్యాండ్లింగ్ ధరల పేరిట వాహనదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందాయి. అటువంటి షో రూం నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా అదనపు రుసుం వాహనదారుల నుంచి వసూలు చేయకూడదు. గోడౌన్ నుంచి షోరూంకు వాహనం తీసుకొచ్చామని, సర్వీసింగ్ చేయించామని అదనంగా డబ్బులు వసూలు చేయకూడదు. అలాంటి చర్యలకు పాల్పడితే షోరూంల రిజిస్ట్రేషన్ అథరైజేషన్ సస్పెండ్ చేస్తాం.

- మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, రవాణా శాఖ విజిలెన్స్ జాయింట్ కమిషనర్.

కిసాన్ మేళాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి భగీరథ చౌదరి తదితరులు

చిరుధాన్యాల సాగుకు అధికప్రాధాన్యత

కేంద్రసహాయ మంత్రి భగీరథ్ చౌదరి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 3: చిరుధాన్యాల ఉత్పత్తులకు దేశ వ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉందని , తక్కువ పెట్టుబడులు, అధిక దిగుబడులు చిరుధాన్యాల సాగువల్లేసాధించవచ్చని కేంద్ర వ్యవసాయ సహాయశాఖమంత్రి భగీరథ చౌదరి అన్నారు. సోమవారం జాతీయ చిరుధాన్యాల కిసాన్ మేళాను హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎన్ఐఆర్డీ పీఆర్ జీడి నరేంద్రనాథ్, కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.రాజిరెడ్డి ,మిల్లెట్స్ సీఈఓ దయాకర్,ఎన్ ఐపిహెచ్ఎం,ఎన్ఐఎమ్ఎస్ఎమ్ఈ సంస్థ డైరెక్టర్లు , రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, ఒడిస్సా, కర్ణాటక రైతులు పాల్గొన్నారు.

సీయూబీ, సీఎస్‌కే ఆధ్వర్యంలో కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డు

సిటీ బ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఐపీఎల్ క్రికెట్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్‌తో సిటీ యూనియన్ బ్యాంక్‌తో కలిసి కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డును విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ క్రెడిట్ ద్వారా సీఎస్‌కే ఫ్యాన్స్‌కు పలు ఆఫర్లను ఇవ్వనున్నట్లు తెలిపింది. కార్డుపై సీఎస్‌కే కలర్, ఐకానిక్ లోగోను ముద్రించి ఇవ్వనుంది. ఉత్తమైన రివార్డులు, బోనస్ పాయింట్లు, క్రికెట్ మ్యాచ్ టికెట్లు, షాపింగ్ వోచర్స్, బెస్ట్ ఆఫర్స్ పొందవచ్చని తెలిపింది. ఈ ఆఫర్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సిటీ యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు కోరుతున్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- ఫిర్యాదులకు ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలి
- అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసి హెడ్‌ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో ప్రజలనుంచి వచ్చిన దరఖాస్తులను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో 107 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 62, ట్యాక్స్ విభాగానికి 11, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు 7 చొప్పున, ఫైనాన్స్ విభాగానికి 4, యూసిడి , ల్యాండ్ అక్విజిషన్ విభాగాలకు రెండు చొప్పున, యూబీడీ, అడ్మిన్రిస్ట్రేషన్, హెల్త్, ఎలక్ట్రికల్, ప్రకటనల విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. జీహెచ్ ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ 32, సికింద్రాబాద్ జోన్12, శేరిలింగంపల్లి జోన్ 19, చార్మినార్ జోన్ 9, ఎల్బీనగర్ జోన్ 13, ఖైరతాబాద్ జోన్‌లో ఒక ఆర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సుభద్ర దేవి, యాదగిరి రావు, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపిలు గంగాధర్, ప్రదీప్, వెంకన్న, జోనల్ సిపి లు, ఎస్టేట్ అధికారి ఉమాప్రకాష్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ సిఇఓ ప్రనస రెడ్డి, రెవెన్యూ జె.సి మహేష్ కులకర్ణి, వాటర్ వర్క్స్ జిఎం సాయి రమణ ఆయా విభాగాల అధికారులు,

ప్రజావాణికి 119 దరఖాస్తులు

సిటీ బ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 119 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జీ ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ. వెంకటచారి,ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్ ఓ వెంకటి, ఎల్డీ సుబ్రహ్మణ్యం, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో వచ్చే క్యాన్సర్లకు.. ముందస్తు టీకాలతో చెక్

- అత్యధికులు రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ బాధితులే
- అవగాహన కార్యక్రమంలో అపోలో వైద్యనిపుణులు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రోజురోజుకు పెరుగుతున్న క్యాన్సర్ బాధిత మహిళల్లో రొమ్ము క్యాన్సర్ బాధితులు మొదటి స్థానంలో నిలువగా, సర్వైకల్ క్యాన్సర్ బాధితులు 2వ స్థానంలో నిలిచారని అపోలో వైద్యనిపుణులు వెల్లడించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా సోమవారం బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌డెక్కన్‌లో అపోలో క్రెడిల్, చ్రిల్డన్స్ హాస్పిటల్, ఎంఎస్‌డి ఫార్మాస్యూటికల్స్ సంయుక్తంగా నిర్వహించిన 'టుగెదర్ ఫర్ హర్ వెల్ బీయింగ్' కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని ప్రసంగించారు. జూబ్లీ హిల్స్ అపోలో క్రెడిల్, చ్రిల్డన్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, గైనకాలజిస్టు డాక్టర్ మహితా రెడ్డి మాట్లాడుతూ భారత్‌లో 2022లో జరిపిన అధ్యయనం ప్రకారం 1.5 లక్షలకు పైగా కొత్త హెచ్‌పీవీ సంబంధిత క్యాన్సర్ కేసులు నమోదైనట్లు తెలిపారు. భారతీయ మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళ తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య పరీక్షలో భాగంగా గైనకాలజిస్టును కలవడం, హెచ్‌పీవీ వ్యాక్సిన్ వంటి టీకాల సమాచారం తెలుసుకోవడం, వ్యాధి నిరోధక చర్యలు పాటించడం ద్వారా మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కొండాపూర్ అపోలో క్రెడిల్, చ్రిల్డన్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మిని శిల్ప మాట్లాడుతూ ప్రతి మహిళ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్టు, ల్యాప్రోస్కోపీ, రోబోటిక్ సర్జన్ డాక్టర్ జాస్మిన్ రథ్ మాట్లాడుతూ తీరికలేని నేటి సమాజంలో మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైపోయిందన్నారు. కానీ శరీరంలో మార్పులను గమనించడం, నివారణా చర్యలు తెలుసుకోవడం, ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధులను రాకుండా ముందస్తుగానే అరికట్టవచ్చన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి:

ప్రతి మహిళ తనకు అవసరమైన టీకాల వివరాలు తెలుసుకోవాలి. తమ పిల్లల టీకా షెడ్యూల్‌ను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్, ఎంఎంఆర్, హెపటైటిస్-బీ, వరిసెల్లా వంటి టీకాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు.

- 12 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు వచ్చిన అమ్మాయిలు గైనకాలజిస్టును సందర్శించాలి. నెలసరి ప్రారంభం అయినా, కాకపోయినా ప్రతి సంవత్సరం వైద్యుడి వద్ద తనిఖీలు చేయించుకోవడం మంచిది.
- ముందస్తు పరీక్షల ద్వారా పాప్ స్మియర్, బ్రెస్ట్ స్క్రీనింగ్ వంటి పద్ధతుల వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, వాటికి అడ్డుకట్ట వేయవచ్చు.
- ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, శరీర బరువు నిర్వహణ చాలా ముఖ్యం.
- హార్మోన్ల సమతుల్యతకు పోషకాహారం కీలకం. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ డీ, ఓమెగా-3, ఫ్యాటీ యాసిడ్స్ వంటి పోషకాలు గర్భాశయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. అందుకని సరైన పౌష్టకాహారం తీసుకోవాలి.
- ఆకుకూరలు, గింజలు, గింజల నూనెలు, పాల పదార్థాలు లేకుండా చేసే డైట్స్ హార్మోన్ల సమతుల్యతకు సహాయపడతాయి.
- ఒత్తిడి, తగిన నిద్ర లేకపోవడం వల్ల రుతుచక్రం సక్రమంగా ఉండదు. ఫలితంగా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ధ్యానం, యోగా, తగిన నిద్ర వంటి జీవన శైలిని అలవర్చుకోవడం ఉత్తమం.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక అభివృద్ధి నిధులతో నియోజక వర్గాల పరిధిలో చేపట్టిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సోమవారం వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్ పనులపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎస్డీఎఫ్ పథకం కింద 268 పనులకు గాను 79 పూర్తి కాగా మరో 73 పురోగతిలో ఉన్నాయని, 10 పనులు టెండర్ దశలో ఉన్నాయని, 48 పనులకు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు చేసి సిద్ధంగా ఉంచాలని, మిగిలిన పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. సీపీఓ డాక్టర్ సురేందర్, టీజీసీఆర్ ఐ ఈఈ గురు ప్రసాద్, జీహెచ్ఎంసీ ఈఈ సనావుద్దీన్, విద్యుత్ శాఖ ఏడీ ప్రార్థన, ఎస్ పీడీసీఎల్ ఈఈ ఎండీ షఫీ మియా పాల్గొన్నారు.

చిన్నారులకు వినికిడి యంత్రాలను అందించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్.

వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించాలి : కర్ణన్

బన్సీలాల్ పేట్, మార్చి 3 : వినికిడి సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే సమస్యలకు చికిత్స అందించవచ్చని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. వరల్డ్ హియరింగ్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మీనాక్షి వెంకట్ రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులకు వినికిడి యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ రాజకుమారి, ఈ ఎన్ టి విభాగం హెచ్ఓడి డాక్టర్ భూపేందర్ సింగ్ రాథోడ్, దాత ఆదినారాయణ, జి ఎం సి ఆలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి ఆర్ లింగమూర్తి, మాజీ అధ్యక్షుడు. డాక్టర్ చంద్రశేఖర్, ఎంవి ఫౌండేషన్ ట్రస్టీ వసంత సేతురామన్, డైరెక్టర్ డాక్టర్ రంగనాథ్, మురళి నటరాజన్, ప్రసాదరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కందగట్ల స్వామి

ఎన్నికల్లో పద్మశాలీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

హిమాయత్ నగర్ మార్చి3: రాష్ట్రంలోని పద్మశాలీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో సంఘం 17వ మహాసభలను ఘనంగా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ సోమవారం నారాయణ గూడలోని పద్మశాలీ భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, నేతలు రామ చంద్ర రావు, కొక్కుల దేవేందర్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు సునీత, పద్మ, బండారి లక్ష్మి, అవ్వారు భాస్కర్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్డీకాపూల్‌లో శ్రీకర దవాఖాన ప్రారంభం

దవాఖానను ప్రారంభిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

సిటీ బ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): శ్రీకర దవాఖాన తొమ్మిదో బ్రాంచ్‌ను లక్డీకాపూల్‌లో సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన శ్రీకర దవాఖాన నైపుణ్యం కలిగిన వైద్యులతో మెరుగైన చికిత్స అందజేస్తున్నదని అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేట్ విజయారెడ్డి, సర్ఫరాజ్, సిద్ధిఖీ, రిజ్వాన్ వివిధ విభాగాలను ప్రారంభించారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆర్థో, క్రిటికల్ కేర్, న్యూరో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ సేవలు అందుబాటులో ఉన్నాయని దవాఖాన సీఎండీ అఖిల్ దాడి పేర్కొన్నారు.

కార్యక్రమంలో దవాఖాన ఇన్‌చార్జిలు డాక్టర్ భానుప్రతాప్, డాక్టర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరిస్తే... కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్

మరో పోరాటంతో ప్రజాక్షేత్రంలో ఎండగడతాం..

మిలియన్ మార్చ్‌తో చరిత్ర సృష్టిస్తాం

టీయూజేఏసీ సెక్రటరి జనరల్ ప్రపుల్‌రాంరెడ్డి

కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్, మార్చి 3: ఉద్యమకారులను విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవని, తెలంగాణ ఉద్యమంలో తూటాలకు ఎదురొడ్డి పోరాటం చేశామని, మాకు దక్కాల్సిన ఫలాలు దక్కకుంటే మిలియన్ మార్చ్‌తో మరో చరిత్ర సృష్టిస్తామని టీయూజేఏసీ సెక్రటరి జనరల్ ప్రపుల్‌రాంరెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 10న నిర్వహించే మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని కోరుతూ టీయూజేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్టా జాతీయ అధ్యక్షుడు షేక్షావలీ, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల నాయకులు కొన్నె వేణు, బండకింది సింగరాయగౌడ్, శివబాబు, యాకస్వామి, చంద్రన్న, యాదగిరి, రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.